


ఆదివారం 31 మే 2026 పేజీలు : 8


## తెలంగాణ ఆవిర్భావ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించాలి



# విధుల నిర్వహణలో ముగ్గురు అధికారుల సేవలు ప్రశంసనీయం

జిల్లా కేంద్రంలో పనిచేసిన ముగ్గురు అధికారుల సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా అన్నారు శనివారం పదవి విరమణ పొందిన ముగ్గురు అధికారులనుజిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉద్యోగ విరమణ పొందిన ఆర్డీవో రత్నకళ్యాణి, సిపిఓ (ముఖ్య ప్రణాళికాధికారి) జీవరత్నం, జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి ల పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ప్రతీ ఉద్యోగి ప్రస్థానంలో పదవీ విరమణ అనేది ఒక సహజ ప్రక్రియ అని అన్నారు. పదవి విరమణ పొందుతున్న ఆర్డీవో రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్మిలు ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ ఉత్తమ అధికారులుగా పేరు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు.



## ఎదగాలనే సంకల్పం ఉంటే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారు



### అమ్మ మాట - అంగన్‌వాడీ బాట'ను

# విజయ వంతం చేయాలి



గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల సమగ్ర ఆరోగ్యం, పోషణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన "అమ్మ మాట - అంగన్‌వాడీ బాట" కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక రిక్షా కాలనీ లో మ హిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "అమ్మ మాట - అంగన్‌వా డీ బాట" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిం చారు.

# తెలంగాణ ఆవిర్భావ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించాలి

## శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్



**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో అత్యంత ఘనంగా, ప్రజలను ఆకట్టుకునేలా నిర్వహించాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అధికారులకు ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరగనున్న నేపథ్యంలో, సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను శనివారం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ పరిశీలించారు. స్టేజీ నిర్మాణం, ప్రేక్షకుల కోసం కూర్చునే ఏర్పాట్లు, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య ఏర్పాట్లు తదితర అంశాలను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వేడుకలకు పెద్దఎత్తున ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున చల్లటి తాగునీరు నిరంతరం అందుబాటులో ఉంచాలని, మూత్రశాలలను పరిశుభ్రంగా నిర్వహించాలని, అదనంగా మొబైల్ టాయిలెట్లు, అంబులెన్స్ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్ బ్యాకప్ సిద్ధంగా ఉంచాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగుల సన్మానం, వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు వంటి అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జీఎం, వేడుకలకు వచ్చే వారందరినీ ఆకట్టుకునేలా కార్యక్రమాలు ఉండాలని అన్నారు. ఇప్పటికే అన్ని విభాగాల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించి వివిధ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేడుకల విజయవంత నిర్వహణకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, ఏరియా ఇంజనీర్ రమణరావు, ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్, ఆర్కే-5 గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, సీఎంఓఏఐ శాఖ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, డీజీఎం (ఈ అండ్ ఎం) స్టోర్స్ మల్లయ్య, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కా రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టును ఖండించిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం



**మంచిర్యాల, మే 30 (ప్రజా జ్యోతి):** మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టును తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు శనివారం ఖండించారు . హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఈనెల 26న జరిగిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం దుర్మార్గమని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు ఖండించారు. ఈ సమావేశంలో సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకపోవడం, కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం, కార్మికుల హక్కులు, సంక్షేమం, ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై బాల్క సుమన్ మాట్లాడారని తెలిపారు. సింగరేణిలో ఓబీ, డీజిల్ వ్యవహారాలు, రాజస్థాన్ పవర్ ప్లాంట్ నిర్మాణం, కొత్త బొగ్గు గనుల అనుమతులు, బొగ్గు నిల్వలకు సంబంధించిన అంశాలపై ఆయన ప్రశ్నించారన్నారు. అయితే ఆ వ్యాఖ్యలను హింసను ప్రేరేపించేలా ఉన్నాయని పేర్కొంటూ అక్రమంగా కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని సంఘం నాయకులు విమర్శించారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం పోరాడే గొంతులను అణచివేసే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ పెద్దలు చేసిన కొన్ని వ్యాఖ్యలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిపై మాత్రమే కేసులు నమోదు చేయడం ద్వారా ప్రభుత్వం చట్టాన్ని తనకు అనుకూలంగా మలుచుకుంటోందని ఆరోపించారు. "సత్యమేవ జయతే" అనే నానుడి ప్రకారం చివరకు చట్టమే గెలుస్తుందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం విశ్వాసం వ్యక్తం చేస్తున్నదని అన్నారు .అక్రమ అరెస్టులకు భయపడకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో, శాంతియుతంగా సింగరేణి కార్మికులకు రావాల్సిన హక్కులు, సంక్షేమం, ఆర్థిక ప్రయోజనాల కోసం పోరాటాలు కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేష్, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్ రెడ్డి, కేంద్ర కమిటీ నాయకులు గద్దం రమణారెడ్డి, ఎండి లాల తదితరులు పాల్గొన్నారు.

# 12వ వేజ్ బోర్డు కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలి



**రామకృష్ణాపూర్, మే 30(ప్రజా జ్యోతి):** ఆర్కే పీ సీహెచ్‌పీలో పిట్ సెక్రటరీ హరి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్మిక సమావేశంలో ఇండియన్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ, వైస్ ప్రెసిడెంట్ ఇప్పకాయల లింగయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలని, 12వ వేజ్ బోర్డు కమిటీ వేయాలని, సింగరేణిలో కొత్త బావులు, డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన అక్బర్ అలీని కార్మికులు సన్మానించారు. కార్యక్రమంలో వేణుగోపాల్, సిరాజుద్దీన్, కృష్ణస్వామి, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్‌లో చోరీ చేసిన నిందితుడి అరెస్ట్

**8 గ్రాముల బంగారు లాకెట్ స్వాధీనం -- రైల్వే పోలీసుల చాకచక్యం**




**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):** స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికురాలి బ్యాగ్‌ను చోరీ చేసిన నిందితుడిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 8 గ్రాముల బంగారు లాకెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం, మే 25వ తేదీ అర్ధరాత్రి 12804 స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ రైలులో గుర్తు తెలియని వ్యక్తి దొంగతనానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన జీఆర్పీ ఎస్సైలు మహేందర్, సుధాకర్, బి.ఎన్.సింగ్, రాజేంద్ర ప్రసాద్, క్రాంతి (సీబీ-ఐపీఎఫ్)లు ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతను సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన దుర్గం ప్రేమ్ కుమార్‌గా గుర్తించారు. విచారణలో నిందితుడు మే 25న బల్లార్షా వద్ద స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కి, నిద్రిస్తున్న మహిళా ప్రయాణికురాలి బ్యాగ్‌ను సిర్పూర్ కాగజ్‌నగర్ సమీపంలో చోరీ చేసినట్లు అంగీకరించాడు. బ్యాగ్‌లో ఉన్న 8 గ్రాముల బంగారు లాకెట్‌తో పాటు రూ.1,300 నగదును తీసుకుని, బ్యాగ్‌ను పడవేసినట్లు తెలిపాడు. అనంతరం బంగారు లాకెట్‌ను విక్రయించేందుకు మంచిర్యాలకు వస్తుండగా రైల్వే పోలీసులు పట్టుకున్నట్లు వెల్లడైంది. నిందితుడి వద్ద నుంచి బంగారు లాకెట్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు అతడిని కాజీపేట్ రైల్వే కోర్టులో రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట్ రైల్వే ఇన్‌స్పెక్టర్ వి. నరేష్, మంచిర్యాల జీఆర్పీ ఎస్సై ఎ. మహేందర్, బెల్లంపల్లి ఎస్సై సుధాకర్, రామగుండం ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

## కౌన్సిల్‌లో నాలుగు తీర్మానాలకు ఆమోదం



**రామకృష్ణాపూర్, మే 30(ప్రజా జ్యోతి):** క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ డాక్టర్ గొడిసెల సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో నాలుగు కీలక అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం లభించింది. కోతుల పట్టివేత, నీటి సరఫరా–వీధి దీపాల మరమ్మతులు, పిచ్చిమొక్కల తొలగింపు, పారిశుద్ధ్య పనుల కోసం నిధులు మంజూరు చేశారు. అనంతరం మున్సిపాలిటీ కొనుగోలు చేసిన నాలుగు స్వచ్ఛ ఆటోలను ప్రారంభించారు. ఈ సమావేశంలో కమిషనర్ ఏ మారుతి ప్రసాద్, వైస్ చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత, రెవెన్యూ అధికారి కె సతీష్, డీఈ ఎం సుమతి, ఎంఏఈ జి ఆశ్రిత్, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి పరిరక్షణకు అటవీ శాఖతో కలిసి పనిచేస్తాం

" ప్రకృతిమిత్ర" సభ్యులు



**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):** ప్రకృతి, పర్యావరణం, అడవుల సంరక్షణతో పాటు కాలుష్య నివారణ లక్ష్యంగా పనిచేస్తున్న "ప్రకృతిమిత్ర" తెలంగాణ పర్యావరణ సామాజిక సంస్థ సభ్యులు శుక్రవారం కరీంనగర్ జిల్లా అటవీ శాఖాధికారి ఎస్. సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ హుస్సేన్ సమక్షంలో జిల్లా అటవీ శాఖాధికారికి పచ్చని మొక్కను అందజేసి ప్రకృతి పరిరక్షణపై చర్చించారు. సంస్థ రాష్ట్ర వ్యవస్థాపకులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, తెలంగాణ ప్రభుత్వ "వాల్టా" నీరు–చెట్టు–నేల సంరక్షణ రాష్ట్ర అథారిటీ పర్యావరణవేత్త ,మంచిర్యాల జిల్లాకు చెందినా గుండేటి యోగేశ్వర్ సంస్థ కార్యకలాపాలను వివరించారు. ఈ సందర్భంగా సంస్థ లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ హర్జిత్ సింగ్, వృక్ష ప్రేమికుడు పుల్లె సత్యనారాయణ, పర్యావరణ పరిరక్షకుడు గద్దె రవికుమార్‌లను జిల్లా అటవీ శాఖాధికారికి పరిచయం చేశారు. అనంతరం ప్రకృతిమిత్ర ఆధ్వర్యంలో నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, మొక్కల పెంపకం, ప్రకృతి అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు. సంస్థ కార్యకలాపాలను దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో ఎస్. సత్యనారాయణ, ఎఫ్‌ఆర్‌వో షౌకత్ హుస్సేన్‌లు సానుకూలంగా స్పందించి ప్రకృతిమిత్ర నిర్వహించే కార్యక్రమాలకు అటవీ శాఖ తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్ర మంలో సిరిసిల్ల ఎఫ్‌ఆర్‌వో జి. నాగేశ్వర్‌రావు, చందుర్తి–మల్యాల ఎఫ్‌ఆర్‌వో ఖలీలుద్దీన్‌తో పాటు అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి



సీపీ అంబర్ కిషోర్ ఝా



**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):**రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు, వారెంట్ల అమలు, పోలీస్ సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనరేట్ పరిధిలో నమోదవుతున్న కేసుల దర్యాప్తులో ఎలాంటి రాజీ పడకుండా పారదర్శకత, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను సూచించారు. 2025 సంవత్సరానికి ముందు నమోదై దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో విచారణ, అరెస్టులు, సాక్ష్యాల సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ప్రాపర్టీ, బాడీలీ అఫెన్స్ కేసుల దర్యాప్తును పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహించాలని తెలిపారు. గ్రేవ్ కేసుల పురోగతిని డీసీపీలు, అదనపు డీసీపీలు వారానికి ఒకసారి సమీక్షించాలని సూచించారు. ఆర్థిక నేరాల కేసుల్లో చట్టప్రకారం నిందితులకు సంబంధించిన ఆస్తులను జప్తు చేసే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కిడ్నాపింగ్, మిస్సింగ్ కేసుల్లో బాధితులను గుర్తించడంలో జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని, అటువంటి కేసుల్లో ఆలస్యం ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని దెబ్బతీసే అవకాశం ఉందన్నారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను గౌరవ న్యాయస్థానం అనుమతితో త్వరితగతిన నిర్వీర్యం చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్, ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన నేరస్థులు ఉన్నట్లయితే వారిని పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నాన్–బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, కన్విక్షన్ శాతం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాల్లో భాగంగా అక్రమ ఇసుక రవాణా, గుడుంబా తయారీ, పేకాట తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే గుట్కా విక్రయాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి, వారి ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని, ప్రజల నుంచి నేరుగా అందే ఫిర్యాదుల ఆధారంగా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. సీపీ కార్యాలయం ద్వారా వచ్చే ఫిర్యాదులపై కూడా వేగంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే అధికారులను సహించేది లేదని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది విధిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించాలని, విధి నిర్వహణలో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. కార్యాలయాలు, విధి నిర్వహణ ప్రాంతాల్లో హెల్మెట్ లేకుండా ఎవరికీ అనుమతి ఇవ్వవద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# పొగాకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే ఆరోగ్యకర సమాజం

### ప్రపంచ నో టొబాకో డే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులు




**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):** ప్రపంచ నో టొబాకో డే సందర్భంగా ఎల్‌బి నగర్‌లోని కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, ఉపాధ్యక్షులు కె. బీరయ్య, సంయుక్త కార్యదర్శి ఎస్. నర్సింగ్ రావు, ఎం. రమేష్ బాబు పాల్గొని పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించే కార్యక్రమానికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కామినేని హాస్పిటల్ వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈగిల్ విభాగం అధికారి సీతారాములు మాట్లాడుతూ యువత పొగాకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులు వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రపంచ నో టొబాకో డే లక్ష్యం పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యక్రమంలో పాల్గొన్నవారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ సుభాకర్ ఎస్పీ సీతారాం లు అతిథులుగా పాల్గొన్నారు .

# ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి






: కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, మే 30 ప్రజా జ్యోతి** జిల్లాలో జూన్ 1న జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని పాలనాధికారి చాంబర్ నుంచి జిల్లా అధికారులు, మండల తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తదితరులతో జూమ్ సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించాలని సూచించారు. కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహించనున్న బహిరంగ సభకు మహిళా సంఘాల సభ్యులను పెద్ద ఎత్తున తరలించాలని, ఇందుకోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి బస్సుకు ఇద్దరు సిబ్బందిని ఇన్‌చార్జులుగా నియమించి, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సాయంత్రం 4.30 గంటలలోపు ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రయాణ సమయంలో అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని, సభ ముగిసిన అనంతరం ప్రజలు సురక్షితంగా తమ గ్రామాలకు చేరుకునే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలని కలెక్టర్ హరిత పిలుపునిచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి లక్ష్మీనారాయణ, గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ ఏరియా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలి

### జీఎం స్ట్రక్చర్ సమావేశంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతిపాదనలు




**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):** శ్రీరాంపూర్ ఏరియాలోని కార్మికులు, ఉద్యోగులు, కాలనీవాసులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులు శనివారం కోరారు. మే నెల జీఎం స్ట్రక్చర్ సమావేశంలో గనుల భద్రత, తాగునీటి సౌకర్యాలు, వైద్య సేవలు, కాలనీల మౌలిక వసతులు, కార్యాలయ సౌకర్యాలకు సంబంధించిన పలు కీలక అంశాలను యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చి ప్రతిపాదనలు సమర్పించారు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని అన్ని గనుల్లో కాలపరిమితి ముగిసిన ఎస్‌డీఎల్ యంత్రాలను తొలగించి వాటి స్థానంలో కొత్త యంత్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అలాగే జీఎం కార్యాలయంలో రికార్డు రూమ్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. జీఎం కార్యాలయ సముదాయంలోని సివిల్ విభాగం కార్యాలయం మొదటి అంతస్తులో ఉండటంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున అక్కడ ఎయిర్ కండిషనింగ్ సౌకర్యం కల్పించాలని సమావేశంలో ప్రస్తావించారు. గతంలో మాదిరిగానే కంపెనీ సొంతంగా కొత్త టిప్పర్ లారీలను కొనుగోలు చేయాలని కూడా ప్రతిపాదించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని గనుల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు సక్రమంగా పనిచేయకపోవడంతో కార్మికులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏఎంసీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మరమ్మతులు ఆలస్యమవుతున్నందున అవసరమైతే కాంట్రాక్టర్‌ను మార్చి తాగునీటి సౌకర్యం నిరంతరంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. షిర్కే కాలనీలోని క్వార్టర్ల వెనుక డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడంతో మురుగునీరు ఇళ్లలోకి చేరుతోందని, వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. అలాగే లీకేజీలతో బాధపడుతున్న క్వార్టర్లపై డాంబర్ షీట్లు వేయించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రతిపాదించారు. ఎస్సార్పీ-3 గని వద్ద ఉన్న సులభ్ కాంప్లెక్స్ పూర్తిగా దెబ్బతిన్నందున మరమ్మత్తులు చేసి కొత్త తలుపులు ఏర్పాటు చేయాలని, ఎస్సార్పీ ఓసీ సమీపంలో నిర్మిస్తున్న ఎకో పార్క్ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆర్కే-8 డిస్పెన్సరీలో ఖాళీగా ఉన్న నర్సుల పోస్టులను భర్తీ చేయడంతో పాటు ఫార్మసీ గదిని విస్తరించాలని, ఆర్కే-8 మరియు నస్పూర్ డిస్పెన్సరీల వద్ద అంబులెన్స్ డ్రైవర్ల కోసం షెడ్లు ఏర్పాటు చేయాలని సమావేశంలో ప్రతిపాదించారు. ఈ సమస్యలు కార్మికులు, ఉద్యోగులు, కాలనీవాసుల దైనందిన జీవితంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయని గుర్తింపు సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. సమావేశంలో ప్రస్తావించిన అంశాలపై యాజమాన్యం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు చేపట్టాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బ్రాంచ్ సెక్రటరీ ఎస్.కే. బాజీ సైదా, వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్‌రావు, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్యతో పాటు గుర్తింపు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## సేవా దృక్పథంతో పనిచేసే వారే నిజమైన రాజకీయ నాయకులు

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):** రాజకీయాలు సేవా దృక్పథంతో సాగినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే వారే నిజమైన రాజకీయ నాయకులుగా చరిత్రలో నిలిచిపోతారని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రచించిన "ప్రజల కథే నా ఆత్మకథ" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, తన జీవితంలో జరిగిన ముఖ్య సంఘటనలను ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. అత్యంత పేదరికం నుంచి ఉన్నత స్థాయికి ఎదగడంలో ఆర్ఎస్ఎస్ కీలక పాత్ర పోషించిందని అన్నారు. ప్రస్తుతం రాజకీయాలు పూర్తిగా కలుషితమవుతున్నాయని, గతంలో రాజకీయాలు సేవా భావంతో నడిచేవని, ఇప్పుడు వ్యాపార దృక్పథంతో సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయ నాయకులు పనిచేయాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే నాయకులే చిరస్థాయిగా గుర్తింపు పొందుతారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. తన చిన్ననాటి రాజకీయ అనుభవాలను గుర్తు చేసుకుంటూ, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో తనకు సత్సంబంధాలు ఉన్నప్పటికీ సిద్ధాంతాల విషయంలో రాజీ పడలేదని చెప్పారు. ఒకప్పుడు విభిన్న సిద్ధాంతాలు ఉన్నప్పటికీ పరస్పర గౌరవం ఉండేదని, అదే రాజకీయాల అసలు విలువ అని అన్నారు. పుస్తకావిష్కరణ అనంతరం తులా మధుసూదన్ రావు బండారు దత్తాత్రేయను సన్మానించగా, ఆయనకు "ప్రజల కథే నా ఆత్మకథ" పుస్తకాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గోనే శ్యాంసుందర్‌రావు, మున్నా రాజా సిసోడియా, గోలి రాము, తులా మధుసూదన్ రావు, హేమాజీ, కాసెట్టి నాగేశ్వరరావు, మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్, పానుగంటి మధు తదితరులు పాల్గొన్నారు.

## మైనింగ్ విభాగంలో రాష్ట్రస్థాయి రెండవ ర్యాంకు సాధించిన మహమ్మద్ ఖాజీముద్దీన్...



**తాండూర్ 30 ప్రజాజ్యోతి** తాండూర్ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ ఖాజీముద్దీన్ శుక్రవారం వెల్లడైనా టీజీ ఈసెట్ ఫలితాలలో సాధించారు. బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల యందు మైనింగ్ డిప్లమా తృతీయ సంవత్సరం పూర్తిచేసి పీజీ ఈసెట్ ప్రిపేర్ అయినట్లు వెల్లడించారు. మహమ్మద్ ఖాజీముద్దీన్ ర్యాంక్ పట్ల మండల ప్రజా ప్రతినిధులు, మైనారిటీ నాయకులు హర్షం వ్యక్తం చేసారు. ఖాజీముద్దీన్ తండ్రి మహమ్మద్ ఖలీముద్దీన్ తాండూర్ మండల కేంద్రంలో చిరు వ్యాపారి.

## జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్




**నేరడిగొండ మే 30 ( ప్రజాజ్యోతి ):**నేరడిగొండ మండల మాజీ జడ్పీటీసీ, సీనియర్ నాయకులు గడ్డం భీంరెడ్డి – శోభ దంపతుల మనుమరాలి జన్మదిన వేడుకలు ఇచ్చోడ మండల కేంద్రంలోని విట్టల్ రెడ్డి గార్డెన్‌లో శనివారం అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు బోథ్ నియోజకవర్గ శాసనసభ్యులు అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసిన చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కుటుంబ సభ్యులు అమరేష్ రెడ్డి, నిఖిలేష్ రెడ్డిలతో పాటు పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారికి శుభాశీస్సులు అందజేశారు.

## అంగన్వాడి వైపు అడుగు..చిన్నారి భవిష్యత్తుకు బంగారు బాట

### జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్




**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):**అంగన్వాడి కేంద్రాల వైపు చిన్నారులు వేసే ప్రతి అడుగు వారి బంగారు భవిష్యత్తుకు బాట వేస్తుందని జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ అన్నారు. మంచిర్యాల పట్టణంలోని రామ్‌నగర్ సెక్టార్‌లో శనివారం నిర్వహించిన 'అమ్మ మాట -- అంగన్వాడి బాట' కార్యక్రమానికి సీడీపీవో విష్ణుప్రియ, సూపర్వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్లతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రౌఫ్ ఖాన్ మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల సంక్షేమం కోసం అంగన్వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించడంతో పాటు, వారి ఎత్తు, బరువులను నిరంతరం నమోదు చేసి శారీరక, మానసిక ఎదుగుదలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పోషన్ అభియాన్‌లో భాగంగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్య ద్వారా పిల్లల భవిష్యత్తును ప్రగతి బాటలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైభవంగా నమ్మాళ్వార్ తిరునక్షత్రం

### రెండు రోజులు దివ్య ప్రబంధం అను సంధానం



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 30 ,( ప్రజాజ్యోతి ).**నమ్మాళ్ వార్ తిరునక్షత్ర ఉత్సవాన్ని శనివారం స్థానిక వాల్మీకి నగర్ రామాలయంలో అత్యంత వైభవంగానిర్వహించారు .ముందు రోజు సాయంకాలం నమ్మాళ్ వార్ అనుగ్రహించి న. తిరువాయ్ మెజి దివ్య ప్రబంధ పారాయణం ప్రారంభించారు. తిరునక్షత్రం పురస్కరించు కొని వేద మంత్రాలతో ఆళ్వార్ మూర్తులకు పంచామృత అభిషేకం చేసారు. పండితులు రామకన్నన్ , డాక్టర్ కోవెల శ్రీనివాసాచార్య, రామానుజాచార్య,టికే ఆచార్య సౌమిత్ ,గోవిందుల శ్రీనివాసాచార్య లు ప్రబంధ పారాయణం చేశారు. నమ్మాళ్ వార్ వైభవాన్ని భక్తులకు వివరించారు . ఆలయ ఉత్సవ కమిటీ భక్తులకు అవసరమైన అన్ని వసతులను సమకూర్చారు . కార్యక్రమంలో రఘురాజ్ , జానకీ ధర్మాగౌడ్ ,వైద్యులు హన్మంత్ రెడ్డి,వాణీ వినోద్ కుమార్ ,ఆలివేలు లు పాల్గోన్నారు .

## జనరల్ మేనేజర్ ఎం. విజయభాస్కర్ రెడ్డికి విశ్రాంత కార్మికుల ఆత్మీయ సన్మానం



**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా అమ్మ గార్డెన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ ఎం. విజయభాస్కర్ రెడ్డికి శనివారం సన్మానం నిర్వహించారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని గోలేటి సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయంలో శనివారం పదవీ విరమణ పొందుతున్న జనరల్ మేనేజర్ ఎం. విజయభాస్కర్ రెడ్డికి మంచిర్యాల జిల్లా అమ్మ గార్డెన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఎం. విజయభాస్కర్ రెడ్డి, సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. సింగరేణి సంస్థను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సంస్థ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమ్మ గార్డెన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు విచ్చకోల అంజయ్య, ఉపాధ్యక్షుడు జెట్టి మురారిరావు, ప్రధాన కార్యదర్శి పులి కిష్టయ్య, ప్రచార కార్యదర్శులు పి. నారాయణ, ఎన్. రమేష్, రాసకట్ల రాజయ్య, ఎల్లందుల కొమరయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కొమురం భీం జిల్లా విశ్రాంత కార్మికుల సంఘం అధ్యక్షుడు బూడిది గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు గుర్రపు గంగయ్యతో పాటు పలువురు విశ్రాంత కార్మికులు హాజరై జనరల్ మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరికలు



**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):** మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు నివాసం (ఎల్ఐసీ కాలనీ) వద్ద బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మాజీ ప్రధాన కార్యదర్శి పడాల రవీందర్ ఆధ్వర్యంలో శనివారం పలు విద్యార్థి సంఘాల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎండీ రెహమాన్, కరుణాకర్, అక్షయ్ చిన్ను, అభిషేక్, సాయి శ్రవణ్, అక్షయ్, ప్రశాంత్, ధనుష్, రోహిత్, అక్షయ్, జోసెఫ్, అంజి తదితరులకు మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి యువత కీలక పాత్ర పోషించాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో తోట తిరుపతి, పడాల శ్రీనివాస్, బల్లికొండ రమేష్, చోటు, నక్క తిరుపతి, జక్కం జగన్, జావిద్, వేణుగోపాల్, సూర్ల రాము, రామగిరి శ్రీకాంత్, ఎండీ షకీల్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు శ్రీరాంపూర్ ఏరియా సిద్ధం

### జూన్ 2న ప్రగతి స్టేడియంలో ఘనంగా నిర్వహణ

శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్



**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జూన్ 2న శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో ఘనంగా నిర్వహించనున్నట్లు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరి యా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాయంత్రం 6 గంటల నుంచి శ్రీరాంపూర్ కాలనీలోని ప్రగతి స్టేడియంలో విద్యార్థినీ, విద్యార్థులు, సేవా సభ్యులు, సింగరేణి కళాకారులచే వివిధ సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నా రు. తెలంగా ణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటాయని తెలిపారు. అదేవిధంగా ఏరియాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను జీఎం చేతుల మీదుగా సత్కరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమ ప్రాంగణంలో సింగరేణి సంస్థకు చెందిన రెస్క్యూ, మెడికల్, ఫారెస్ట్, మైన్స్, సేవా సమితి, కమ్యూనికేషన్ తదితర విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ప్రజలను ఆకర్షించేలా వివిధ రకాల తినుబండారాలు, ఇతర ప్రదర్శన స్టాల్స్‌కు కూడా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. స్టాల్స్ ఏర్పాటు చేయదలచిన వారు జూన్ 1 (సోమవారం) సాయంత్రంలోగా జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయడానికి ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జీఎం మునిగంటి శ్రీనివాస్ కోరారు.

# పొగాకు రహిత సమాజమే ఆరోగ్య భారతం







**ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సామాజిక విశ్లేషకులు ఆళవందార్ వేణు మాధవ్ పిలుపు**

**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):** పొగాకు రహిత సమాజ నిర్మాణమే ఆరోగ్యవంతమైన భారతదేశానికి పునాది అని సామాజిక విశ్లేషకులు ఆళవందార్ వేణు మాధవ్ పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొగాకు వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక నష్టాలపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 1987లో ప్రారంభించిన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే 31న నిర్వహిస్తూ, పొగాకు వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలను చైతన్యపరుస్తోందని తెలిపారు. సిగరెట్ ప్యాకెట్లపై "పొగాకు ఆరోగ్యానికి హానికరం" అనే హెచ్చరికలు ఉన్నప్పటికీ, పొగాకు వినియోగం ఇంకా ఆందోళనకర స్థాయిలో కొనసాగుతుండడం విచారకరమన్నారు. సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీ, పాన్ మసాలా వంటి పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు, పక్షవాతం వంటి అనేక ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది పొగాకు కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. భారతదేశంలో యువతలో పొగాకు అలవాటు వేగంగా పెరుగుతోందని, సినిమాలు, సోషల్ మీడియా ప్రభావం, స్నేహితుల ఒత్తిడి వంటి కారణాలతో యువకులు పొగాకు వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ఒకసారి అలవాటు పడితే దానిని విడిచిపెట్టడం కష్టమవుతుందని, దీనివల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా దెబ్బతింటోందని తెలిపారు. పొగాకు వినియోగదారులతో పాటు పాసివ్ స్మోకింగ్ కారణంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు కూడా అనారోగ్యానికి గురవుతున్నారని, అందువల్ల ఇది వ్యక్తిగత సమస్య మాత్రమే కాకుండా సామాజిక సమస్యగా కూడా చూడాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పొగాకు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని, యువతను క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలని సూచించారు. కుటుంబ సభ్యులు కూడా పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సత్యాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ పొగాకు అలవాటుకు దూరంగా ఉండాలని, పొగాకు రహిత సమాజ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలని ఆళవందార్ వేణు మాధవ్ పిలుపునిచ్చారు.

# నేరస్తులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుంది





**కన్విక్షన్ శాతం పెంచేందుకు సమన్వయంతో పనిచేయాలి**
**సీపీ అంబర్ కిషోర్ ఝా**

**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):**నేరస్తులకు తప్పనిసరిగా శిక్ష పడితేనే సమాజంలో నేరాల సంఖ్య తగ్గుతుందని, బాధితులకు న్యాయం జరిగేలా కోర్టు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది కృషి చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంచిర్యాల ,పెద్దపల్లి జోన్లకు చెందిన కోర్టు డ్యూటీ అధికారులు, లైజనింగ్ అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరస్తులకు శిక్ష పడేలా సాక్షులను సమయానికి కోర్టులో ప్రవేశపెట్టి, ట్రయల్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కోర్టులో బాధితులకు న్యాయం జరిగేలా మానవత్వంతో వ్యవహరించాలని, దోషులకు శిక్ష పడే ప్రక్రియలో కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. నేరస్తులకు సంబంధించిన వారెంట్లు, సమన్లు సత్వరమే అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కోర్టు ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు అందించాలని, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూచనలు, సలహాలను పాటించాలని సూచించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసులు, వారెంట్లు, సమన్ల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేసి పర్యవేక్షించాలని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా సమర్థవంతంగా పనిచేస్తే పోలీసు శాఖపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని అన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన ప్రతి ఒక్కరికీ చట్టపరమైన శిక్ష పడేలా కృషి చేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా టీ ఎస్ కాప్ అప్లికేషన్‌లోని సీసీడీ మాడ్యూల్‌కు సంబంధించిన సమన్లు, వారెంట్ల నమోదు, జారీ ప్రక్రియ, సర్వీస్ వివరాల నమోదు, పెండింగ్ వారెంట్ల పర్యవేక్షణ, కోర్టు ప్రక్రియల నిర్వహణ అంశాలపై పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించారు.

## మృతుడి కుటుంబానికి కౌన్సిలర్ చేయూత



**రామకృష్ణాపూర్, మే 30(ప్రజా జ్యోతి):** రామకృష్ణాపూర్ 18వ వార్డు నివాసి జనగామ భాస్కర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, వారి కుటుంబానికి వార్డు కౌన్సిలర్ పల్లె శ్రీదేవి,రాజు 50 కిలోల బియ్యాన్ని అందజేసి పరామర్శించారు. భాస్కర్ మృతి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారి పిల్లల చదువులకు అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిట్టు, ఇబ్రహీం, ఎర్రల శంకర్, డాక్టర్ రాజన్న, బోనగిరి రవి పాల్గొన్నారు.

## కుటుంబానికి సమయం కేటాయిస్తూ ఆనందంగా జీవించాలి

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**
**ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు ఘన సన్మానం**



**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):**సమాజ శాంతి, భద్రతల కోసం తమ కుటుంబాల కంటే ప్రజల సంక్షేమానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ సేవలందించేది పోలీసులేనని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం పోలీస్ అధికారులు తమ కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడుపుతూ ఆరోగ్యకరమైన, ఆనందమయ జీవితాన్ని కొనసాగించాలని సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘకాలం పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన ఎస్ఐ కె. వేణుగోపాల్, ఏఎస్ఐ ఎం. సురేందర్ రెడ్డిలను శనివారం కమిషనర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి పూలమాలలు వేసి జ్ఞాపికలను అందజేసి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ విధులు నిర్వహించే క్రమంలో అధికారులు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటారని, శాంతి భద్రతల పరిరక్షణ కోసం కొన్ని సందర్భాల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తారని అన్నారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన ఇటువంటి అధికారులు భావితర పోలీసులకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతిరోజూ యోగ లేదా వ్యాయామం చేయాలని సూచించారు. అలాగే కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతూ ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏఓ శ్రీనివాస్, ఆర్ఐ రమేష్, రామగుండం పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్క సుమన్ అరెస్టుతో భీమారంలో ఉద్రిక్తత

**సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం**

**జాతీయ రహదారిపై రాస్తారోకో**



**జైపూర్ మే 30:** ప్రజా జ్యోతి చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ అరెస్టుకు నిరసనగా భీమారం మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగాయిజాతీయ రహదారిపై ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.స్థానిక బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆందోళనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బాల్క సుమన్ అరెస్టును తీవ్రంగా ఖండించారు.రాజకీయ కక్షసాధింపుతోనే అరెస్టు చేశారని ఆరోపించారు.దిష్టిబొమ్మ దహనం అనంతరం నిరసనకారులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టడంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిరసనకారులను శాంతింపజేసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. బాల్క సుమన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష గొంతును అణిచివేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు.

## సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టు పెడితే చట్టరీత్యా కఠిన చర్యలు.సి.ఐ రమణా మూర్తి



**జన్నారం,మే30(ప్రజాజ్యోతి)**సోషల్ మీడియా ద్వారా సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే, పెట్టిన వారితో సహ గ్రూప్ అడ్మిన్ పైన కూడా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడునని లక్సెట్టిపేట సిఐ రమణమూర్తి హెచ్చరించారు.శుక్రవారం రోజున లక్సెట్టిపేట సి.ఐ రమణా మూర్తి,జన్నారం ఎస్.ఐ ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో జన్నారం పోలీస్ స్టేషన్లో సోషల్ మీడియా మరియు సైబర్ క్రైమ్ పై జన్నారం పోలీస్ స్టేషన్లో వివిధ రాజకీయ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఐ రమణా మూర్తి మాట్లాడుతూ వాట్సాప్ గ్రూప్ ల అడ్మిన్లు గ్రూపులలో ఉన్న సభ్యులు ఫేక్ న్యూస్ లు, అసభ్యకరమైన, విద్వేషపూరిత లేదా చట్ట విరుద్ధ పోస్టులను నిరోధించి, ఒకవేళ అలాంటివి పెట్టినట్లయితే వారిని హెచ్చరించడం లేదా గ్రూప్ నుంచి తొలగించాలని సూచించారు. కావున గ్రూప్ అడ్మిన్లు గ్రూప్ లలో రెచ్చగొట్టే పోస్టు పెట్టకుండా చూసుకోవాలని ఒకవేళ పెట్టినట్లయితే వారితో పాటు గ్రూప్ అడ్మిన్ల పైన కూడా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు

# ప్రజాస్వామ్య విలువలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలి



జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి):**ప్రజల యొక్క ప్రజల చేత, ప్రజల కొరకు ఏర్పడిన ప్రజాస్వామ్య వ్యవస్థ భారతదేశంలో విజయవంతంగా కొనసాగుతూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మేయర్ ధర్ని మధుకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించి, తమను పాలించే నాయకులను ఎన్నుకునే శక్తిని ఇచ్చిందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ గుర్తింపు పొందిందని, శాసనసభ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకునే స్వేచ్ఛను కలిగి ఉన్నారని తెలిపారు.ఎన్నికల సంఘాల పర్యవేక్షణలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించబడుతున్నాయని, ప్రతి ఓటరు తన ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీతనంతో సేవలందించాలని, హక్కులు, చట్టాలపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య ఉద్యోగ సాధనకే పరిమితం కాకుండా సమాజం, హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించే సాధనమని చెప్పారు. విద్యార్థులు ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాలని, తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి ఏకాగ్రత, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. మహిళల రక్షణ, సాధికారత, సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. దేశంలో భిన్న మతాలు, కులాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ భారతీయులంతా ఐక్యంగా జీవిస్తున్నారని, యువతే దేశ భవిష్యత్తు అని అన్నారు. అక్షరాస్యతలో మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలపడానికి అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నారని తెలిపారు .మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో విద్యార్థులు ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరును ప్రతిబింబించే విధంగా సభా నిర్వహణ చేపట్టి ఆకట్టుకున్నారు. కార్యక్రమం ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ అవగాహన, ఓటు హక్కు ప్రాధాన్యతపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించింది.

## చట్టసభల పనితీరుపై విద్యార్థి దశ నుండే అవగాహన అవసరం



జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 30 ,( ప్రజాజ్యోతి ).**“ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక”లో భాగంగా శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మహిళా వారోత్సవాలు, స్నేహ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల నమూనా పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహిస్తున్న మాక్ పార్లమెంట్ ను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలు, చట్టసభల పనితీరుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. భవిష్యత్తులో ఉత్తమ నాయకులుగా ఎదగడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ నమూనా పార్లమెంట్‌లో విద్యార్థులు ప్రధానమంత్రి, స్పీకర్, ప్రతిపక్ష నాయకులు, కేంద్ర మంత్రుల పాత్రలను ఎంతో సమర్థవంతంగా పోషించారు. మహిళా స్నేహ కార్యక్రమంలో భాగంగా సమాజంలో మహిళల భద్రత, విద్య, సమాన హక్కుల సాధనపై సభలో బిల్లును ప్రవేశపెట్టి లోతుగా చర్చించారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాల పాత్రల్లోని విద్యార్థులు వేసిన ప్రశ్నలకు, మంత్రుల పాత్రల్లోని విద్యార్థులు సమాధానాలు ఇచ్చారు.నమూనా పార్లమెంట్ కార్యక్రమానికి సంబంధించి, కలెక్టర్, విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి పరిజ్ఞానాన్ని పరిశీలించారు. నమూనా పార్లమెంట్‌లో ఆసక్తిగా పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేతల అరెస్టులను ఖండించిన బాపు నాయక్




చెన్నూరు, మే 30: ప్రజా జ్యోతి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీఆర్ఎస్ కోటపల్లి మండల సోషల్ మీడియా అధ్యక్షుడు బాపు నాయక్ మండిపడ్డారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, వాటిని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళనకరమని అన్నారు. చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నందుకే ఆయనపై ప్రభుత్వం భయపడుతోందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి మాటలకు పొంతన లేకుండా పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన ప్రభుత్వం వాటిని కాలరాస్తోందని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రభుత్వ అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల ముందు ఉంచుతూనే ఉంటామని స్పష్టం చేశారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని బాపు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల తరఫున పోరాటాలు మరింత ఉధృతంగా కొనసాగుతాయని హెచ్చరించారు.

## డాక్టర్ అశోక్ మహుల్కర్ ను సన్మానించిన పోలీస్ మిత్రులు



కెరమెరి మే 30 ( ప్రజా జ్యోతి ) లుసియానా అమెరికన్ రీసెర్చ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ పూణే నుండి ఇటీవల గౌరవ డాక్టరేట్ అవార్డ్ అందుకున్న భారతీయ బౌద్ధ మహా సభ కొమరం భీమా ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ మహుల్కర్ ను శనివారం 1993 బ్యాచ్ కు చెందిన మంచిర్యాల, నిర్మల్,అదిలాబాద్ జిల్లాల పోలీస్ మిత్ర బృందం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు పోలీస్ మిత్ర బృందం సభ్యులు మాట్లాడుతూ అశోక్ బుద్దిజం,అంబేద్కరిజమ్ ద్వారా మారుమూల ప్రాంతాలకు చెందిన ప్రజలను చైతన్యం చేయడానికి చేసిన కృషిని గుర్తించిన లూసియానా అమెరికన్ రీసెర్చ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ పూణే వారు డాక్టరేట్ ప్రదానం చేసే గౌరవించడం గౌరకరణమని అన్నారు. అంగారిన వర్గానికి విద్య,అందించడంలో, సమాజ సేవ చేయడంలో ఇక ముందు కూడా ముందు ఉండాలని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో ఆసిఫాబాద్ మున్సి పాలిటి కౌన్సిలర్ జాదే వినోద్,మంచిర్యాల యస్ ఐ ఎస్ టీ రెడ్డి,హెడ్ కానిస్టేబుల్ శంకర్,గంగమోహన్,తిరుపతి, శ్రీనివాస్, చిరంజీవి, ఇస్తరి, తోపాటు అంబేడ్కర్ సంఘం అధ్యక్షులు దుర్గం దుర్గాజీ,గౌరవ అధ్యక్షులు జైరాం,ప్రధాన కార్యదర్శి విజయ్, ఎస్ ఎస్ డి జిల్లా ఆర్గనైజర్ రోషన్, సమాజ అధ్యక్షులు శ్యామ్ రావు లహిజి దుర్గే, తదితరులు పాల్గొన్నారు.

## బాల్క సుమన్ అరెస్ట్ రాజకీయ కక్షతోనే

– ఆసంపెల్లి సంపత్ కుమార్




చెన్నూర్ మే 30 ప్రజా జ్యోతి బీఆర్ఎస్ నాయకుడు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్ అప్రజాస్వామిక చర్య అని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కోటపల్లి మండల అధ్యక్షుడు ఆసంపెల్లి సంపత్ కుమార్ విమర్శించారు. రాజకీయ అక్కసు, కక్షసాధింపు ధోరణితోనే రాష్ట్ర ప్రభుత్వం బాల్క సుమన్‌ను అరెస్ట్ చేసిందని ఆరోపించారు. దళిత నాయకుడిగా, బడుగు బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే ఆయనను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి తో సహా కాంగ్రెస్ నాయకులు గతంలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, ప్రతిపక్ష నేతలపై మాత్రమే కేసులు నమోదు చేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులకు ఒక చట్టం, ప్రతిపక్ష నాయకులకు మరో చట్టం అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం నిజంగా చిత్తశుద్ధితో పనిచేస్తే రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలను సకాలంలో కొనుగోలు చేసి తమ సామర్థ్యాన్ని నిరూపించాలని డిమాండ్ చేశారు. బాల్క సుమన్ అరెస్ట్ పూర్తిగా కక్షపూరిత చర్యేనని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని ఆసంపెల్లి సంపత్ కుమార్ అన్నారు.

## వరి ధాన్యం ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి): ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీ ప్రాంతంలో ఉన్న హనుమాన్ రైస్ మిల్లును సందర్శించిన కలెక్టర్, ధాన్యం దిగుమతి, నిల్వ ప్రక్రియలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ధాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్యాలను త్వరగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నందున, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, అవాంతరాలు లేకుండా నిర్వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని, మొక్కజొన్నను గోదాముల్లో సక్రమంగా నిల్వ చేయాలని ఆదేశించారు. అనంతరం నస్పూర్ మండలంలోని స్టేట్ వేర్‌హౌస్ కార్పొరేషన్ గోదామును మండల తహసీల్దార్ సంతోష్ కుమార్‌తో కలిసి సందర్శించిన కలెక్టర్, నిల్వ ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పలు గ్రామపంచాయతీలను సందర్శించిన ఎంపీఓ శ్రీపతి బాపురావు



జైపూర్, మే 30: ప్రజా జ్యోతి జైపూర్ మండలంలోని పౌనూర్, శివ్వారం గ్రామపంచాయతీలను మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) శ్రీపతి బాపురావు శనివారం సందర్శించి వివిధ అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించిన ఆయన తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని రహదారులు మురుగు కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్లు ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడా లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. జల సంచయ -- జల భాగీదారి' సర్వేలో భాగంగా ఇంటింటికీ తిరిగి వాటర్ హార్వెస్టింగ్ ఆస్తులను మొబైల్‌లో నమోదు చేస్తున్న ప్రక్రియను పరిశీలించిన ఎంపీఓ, ఈ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, జూన్ 2 నాటికి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేసి పలు అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఈ పర్యటనలో పౌనూర్, శివ్వారం గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు భాస్కర్, ప్రవీణ్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆరోగ్యకర జీవనానికి యోగా ఉత్తమ మార్గం

మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు



మంచిర్యాల, 30, మే (ప్రజాజ్యోతి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శృతి గోలి బర్త్ రూట్స్ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన యోగా కేంద్రాన్ని మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందని అన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకుని ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపాలని సూచించారు. యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేసిన హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించిన ఆమె, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలతో పాటు ఆరోగ్య పరిరక్షణకు దోహదపడే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం హాస్పిటల్ ప్రతినిధి సురేఖమ్మను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య--మహేష్, కార్పొరేటర్ మాదంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ విద్యకు ఎంపికైన విద్యార్థులకు సన్మానం

## వన్నెతెచ్చిన విద్యార్థులు మస్కాపూర్ సర్పంచ్ దొనికెని లక్ష్మీ దయానంద్ వెల్లడి

**ఖానాపూర్ మే 30( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ హై స్కూల్ విద్యార్థులు మెధా ట్రస్ట్ కార్పొరేట్ విద్యకు ఎంపికైన సందర్భంగా శనివారం ఘనంగా సన్మానించారు విద్యార్థుల ఎంపిక హై స్కూల్ తో పాటు గ్రామానికి వన్నెతెచ్చిందని సర్పంచ్ దొనికని లక్ష్మీ దయానంద అన్నారు మెధా ట్రస్ట్ ఆధ్వర్యంలో 6 సంవత్సరాల ఉచిత కార్పొరేట్ విద్యకు ఎంపికైన పీఎం శ్రీ జెడ్ పి హెచ్ ఎస్ మాస్కాపూర్ విద్యార్థులు డి. యశ్వంత్ డి. ఉదయ్.లను గ్రామంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీమతి డోనికేని లక్ష్మీ దయానంద్ ఉపసర్పంచ్ డోనికేని వెంకటేష్ వీడీసీ చైర్మన్ చిలుకూరి కృష్ణ ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు విద్యార్థులను అభినందించి శాలువాలతో సత్కరించారు.విద్యార్థులు సాధించిన ఈ విజయంతో




పాఠశాల, గ్రామానికి మంచి గుర్తింపు లభించిందని గ్రామ సర్పంచ్ దొనికని లక్ష్మీ దయానంద్ అన్నారు భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి పాఠశాలకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# బాసర ట్రిబుల్ ఐటీలో 2026-27 ప్రవేశాల తొలి జాబితా విడుదల



**బాసర ట్రిబుల్ ఐటీలో సీట్లకు పోటీ పెరిగింది....**

**31,896 దరఖాస్తులు.. 1,692 మంది ఎంపిక..**

**జూన్ 5, 6, 8 తేదీల్లో కౌన్సెలింగ్...**

నిర్మల్ జిల్లా బాసర, రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ అయిన ఆర్జీయూకేటీ (ట్రిబుల్ ఐటీ) బాసరలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల తొలి దశ ఎంపిక జాబితాను శనివారం విడుదల చేశారు. వీసీ ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిక జాబితాను అధికారికంగా ప్రకటించారు.ఈ ఏడాది బాసర, మహబూబ్‌నగర్ క్యాంపస్‌లలోని ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం మొత్తం 31,896 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, తొలి దశలో 1,692 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గత ఏడాదితో పోలిస్తే దరఖాస్తుల సంఖ్య 60 శాతానికి పైగా పెరగడం ట్రిబుల్ ఐటీలకు పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా



నిలిచింది.ఎంపికైన విద్యార్థులకు జూన్ 5, 6, 8 తేదీల్లో మూడు విడతలుగా బాసర క్యాంపస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలతో తప్పనిసరిగా హాజరు కావాలని అధికారులు సూచించారు. గైర్హాజరైతే ప్రవేశ అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు.ఈసారి ఎంపికైన విద్యార్థుల్లో బాలికల శాతం 73 ఉండగా, బాలుర శాతం 27గా నమోదైంది. అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 85 శాతం ఉండటం విశేషంగా నిలిచింది. గ్రామీణ, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ట్రిబుల్ ఐటీలు మరింత చేరువవుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఎంపిక జాబితా, కౌన్సెలింగ్ వివరాలు ఇతర సమాచారం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆర్జీయూకేటీ అధికారులు వెల్లడించారు. బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

## గుండె చికిత్స పొందుతున్న పసికందును పరామర్శించిన

నియోజకవర్గ బి ఆర్ఎస్ ఇంచార్జ్ జాన్సన్ నాయక్

**ఖానాపూర్ మే 30( ప్రజాజ్యోతి )** ఖానాపూర్ నియోజకవర్గం లోని కడెం మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లె మల్లారెడ్డి 6 నెలల మనవడు అద్విక్ రెడ్డి, హైదరాబాద్‌లోని రెయిన్ బో ఆసుపత్రిలో గుండె సంబంధిత చికిత్స పొందుతున్నారు విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ శనివారం. ఆసుపత్రికి వెళ్లి బాబును పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.కుటుంబ సభ్యులకు మనోధైర్యం



కల్పించి అద్విక్ రెడ్డి త్వరగా కోలుకో కోవాలని ఆకాంక్షించారు

## ఆదివారం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి లో జీసీసీ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**కెరమెరి మే 30 ప్రజా జ్యోతి** కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కేంద్రంలోని ఆదివాసి భవనంలో ఆదివారం నాడు జొన్నల కొనుగోలు కేంద్రంను ప్రారంభించనున్నట్లు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) డివిజనల్ మేనేజర్ గుడిమళ్ల సందీప్ కుమార్ పేర్కొన్నారు. శనివారం నాడు కెరమెరి మండల కేంద్రం లోని ఆదివాసి భవనం వద్ద చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.రైతులు తమ జొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకురావచ్చు అని ఎకరానికి పది క్వింటాల చొప్పున ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలకు రూ.3,699 /- గా ఉందని, మధ్య దళారులకు అమ్ముకొని రైతులు నష్టపోవద్దని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ తారాచంద్, జీసీసీ సిబ్బంది సత్యనారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత



**కేరమెరి మే 30, ప్రజా జ్యోతి** రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లాలోని కెరమెరి మండలం కొఠారి కొత్తగూడ గ్రామానికి జూన్ 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు విచ్చేస్తున్న సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, గృహ నిర్మాణ శాఖ పి.డి. ప్రకాష్ రావు లతో కలిసి ఏర్పాట్లతో పాటు ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహప్రవేశాలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను చక్కగా అలంకరించాలని, గ్రామస్తులతో సహ పంక్తి భోజనంతో పాటు లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమం ఉన్నందున సమావేశ వేదిక వద్ద పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. హెలిప్యాడ్ నుండి గ్రామంలో వచ్చే దారిలో స్వాగత తోరణాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని, పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులకు ఘనంగా స్వాగతం పలికేలా అధికారులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మక్కల కొనుగోళ్లలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిర్మల్ జిల్లా వరి కొనుగోళ్లు కూడా వేగవంతం

## ప్రతి గింజను కొనుగోలు చేస్తాం -- రైతులు ఆందోళన చెందవద్దు

### జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 30 ,( ప్రజాజ్యోతి ).** జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించిన మక్కలు, వరి, జొన్నల కొనుగోళ్లు రవాణా ప్రక్రియలు వేగవంతంగా కొనసాగుతున్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మొక్కజొన్న, వరి, జొన్నల కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని అన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

**మక్కల కొనుగోళ్లలో రికార్డు**

మే 31 నాటికి 1.10 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400 ఉండటంతో రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకువచ్చారని తెలిపారు. బహిరంగ మార్కెట్లో క్వింటాలుకు రూ.1,700--1,800 మాత్రమే లభిస్తుండగా, ప్రభుత్వ కొనుగోళ్ల ద్వారా రైతులకు అధిక లాభం చేకూరిందన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు కేంద్రాలకు వచ్చిన ప్రతి గింజను కొనుగోలు చేయడం ద్వారా మే 30 నాటికే 1.61 లక్షల మెట్రిక్ టన్నుల మక్కల కొనుగోలు పూర్తిచేసి రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు.

**మక్కల రవాణా శరవేగం**

ఇప్పటివరకు 1.34 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను గోదాములకు తరలించగా, సుమారు 30 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రాల్లో మిగిలి ఉన్నాయని తెలిపారు. రోజుకు 5 నుంచి 6 వేల మెట్రిక్ టన్నుల చొప్పున రవాణా కొనసాగుతోందని, జూన్ 2 నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని వెల్లడించారు. వర్షాల నేపథ్యంలో మక్కలు తడిసి మొలకెత్తే ప్రమాదం ఉన్నందున వరి కంటే మక్కల రవాణాకే ప్రాధాన్యత ఇస్తున్నామని, ఒక్క కిలో కూడా నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**వరి కొనుగోళ్లు ముమ్మరం**

జిల్లాలో 1.80 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. గతేడాది కూడా ఇదే స్థాయిలో కొనుగోళ్లు జరిగాయని గుర్తు చేశారు. ఇప్పటివరకు 80 నుంచి 85 వేల మెట్రిక్ టన్నుల వరిని గోదాములకు తరలించామని, ప్రస్తుతం రోజుకు 6 నుంచి 7 వేల మెట్రిక్ టన్నుల వరి రవాణా జరుగుతోందన్నారు. మక్కల రవాణా పూర్తయిన తర్వాత అదనపు లారీలు, హమాలీలను వరి రవాణాకు వినియోగించి రోజువారీ



సామర్థ్యాన్ని 9 వేల మెట్రిక్ టన్నుల వరకు పెంచుతామని తెలిపారు.

**వర్షాలపై ముందస్తు చర్యలు**

రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రోడ్లపై, లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని గుర్తించి రక్షణ చర్యలు చేపట్టామని, ఇప్పటివరకు ఒక్క బస్తా ధాన్యం కూడా తడవలేదని చెప్పారు. ఒకవేళ భారీ వర్షాలు కురిసినా ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని స్పష్టం చేశారు.

**జొన్నల కొనుగోళ్లకు సన్నద్ధం**

జిల్లాలో జొన్నల కొనుగోలు కోసం 13 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మక్కల కొనుగోళ్లు పూర్తయిన వెంటనే జొన్నల కొనుగోళ్లను ముమ్మరం చేయనున్నట్లు చెప్పారు. క్వింటాలుకు రూ.3,700 మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా 35 వేల నుంచి 40 వేల మెట్రిక్ టన్నుల జొన్నల కొనుగోళ్లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. జొన్నల నిల్వ కోసం ఇప్పటికే 20 నుంచి 25 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను సిద్ధం చేశామని, జూన్ 10 లేదా 11 నాటికి కొనుగోళ్లు, రవాణా పూర్తవుతాయని తెలిపారు.

**గోదాముల సామర్థ్యం పెంపు**

భారీ స్థాయిలో పంట కొనుగోళ్లు జరుగుతున్న నేపథ్యంలో గోదాముల కొరత తలెత్తకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1.90 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. లోకేశ్వరం, కడెం మండలాల్లో అదనపు గోదాములను గుర్తించి వినియోగంలోకి తీసుకువచ్చామని, రైతుల పంట భద్రతకు పూర్తి స్థాయిలో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తమ్ముడు మృతితో విషాదంలో ఉన్న సట్టి సాయన్నకు పరామర్శ

**సారంగాపూర్,మే 30, ప్రజా జ్యోతి** దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సట్టి సాయన్న తమ్ముడు రాజన్న ఈ నెల 26న ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకె ప్రభాకర్, నేటివార్త స్టాఫ్ రిపోర్టర్ రాజు,ఎంహెచ్‌పీఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కత్తి విష్ణు, దుందాం కళాకారుడు దరువు భోజన్న నిర్మల్ పట్టణంలోని గాజులపేటలో ఉన్న సట్టి సాయన్న నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రాజన్న మృతి పట్ల ప్రగాఢ



సంతాపం వ్యక్తం చేసిన వారు, సట్టి సాయన్నతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి తమ సానుభూతిని తెలియజేశారు. రాజన్న ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.

## అసంతృప్తిగా కామాయిపేట్ గ్రామపంచాయతీ భవనం



**అదిలాబాద్ టౌన్ , మే 30( ప్రజా జ్యోతి )** అదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కామాయి పేట గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని గుత్తేదారులు మధ్యలో వదిలేశారు. భవన నిర్మాణం పూర్తి కాలేదు. గ్రామ సర్పంచ్ మడావి భీం రావ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని ఉట్నూర్ ఐటీడీఏ లో వినతి పత్రం ఇచ్చిన, గుత్తే దారున్ని అడిగిన గ్రాంట్లో డబ్బులు లేవు వచ్చినపుడు చేస్తామని చేతులెత్తేస్తున్నాడని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామపంచాయతీ అనేది గ్రామస్తుల కళ అని చెప్పారు.

## ఆదర్శ దంపతులను సన్మానించిన రిపోర్టర్లు



**బాసర మే 30 (ప్రజా జ్యోతి)**బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఏఈఓ గా విధులు నిర్వహిస్తున్న గంగ శ్రీనివాస్ వాణిశ్రీ నేడు పెళ్లి రోజు శుభ సందర్భంగా దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలిపి శాలువాతో వారిని రిపోర్టర్లు నర్సూరి భీమ్ రావు,ఎమ్మేవార్ విజయ్ కుమార్,అవదుత్ ఘనంగా సన్మానించి స్వీట్లు పంచిపెట్టారు. ఇలాంటి పెళ్లిరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు

## స్వర్ణ ప్రాజెక్టును సందర్శించిన కాంగ్రెస్ పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి



**సారంగాపూర్, మే 30, ప్రజా జ్యోతి** మండలంలోని స్వర్ణ ప్రాజెక్ట్ ను మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి,పి ఎస్ సిఎస్ చైర్మన్ ఐర నారాయణరెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి ఫోరమ్ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మధ్య కెనాల్ వాటర్ వదిలిపెట్టడంతో నీరు వృధాగా పోవడం జరుగుతుందని . వచ్చేది వర్షాకాలం ఎప్పుడు వర్షాలు పడతాయో లేదో తెలియదని వాటర్ ను కాపాడుకుంటేనే రైతులకు ఉపయోగంఉంటుందని, ప్రాజెక్ట్ వాటర్ స్టోరేజ్ తో బోరు బావులలో నీరు ఉంటుందని లేకుంటే ఎండిపోతాయని అన్నారు. ప్రాజెక్ట్ అధికారుల తో మాట్లాడగా అది తూము మరమ్మత్తులలో ఉంది అని తెలిపారు. అశ్రద్ధగా వదిలిపెడితే నీరు పోయి రైతులు ఇబ్బంది పడతారని వెంటనే మరమ్మత్తు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ రాజేశ్వర్, మాజీ సర్పంచ్ రాజేశ్వరరావు, ఓలత్ర నారాయణ రెడ్డి,కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# విధుల నిర్వహణలో ముగ్గురు అధికారుల సేవలు ప్రశంసనీయం





పదవి విరమణ పొందిన అధికారులకు ఘనంగా సన్మానం

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వెల్లడి

**ఖానాపూర్ మే 30( ప్రజా జ్యోతి)** జిల్లా కేంద్రంలో పనిచేసిన ముగ్గురు అధికారుల సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా అన్నారు శనివారం పదవి విరమణ పొందిన ముగ్గురు అధికారులనుజిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉద్యోగ విరమణ పొందిన ఆర్డీవో రత్నకళ్యాణి, సిపిఓ (ముఖ్య ప్రణాళికాధికారి) జీవరత్నం, జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి ల పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ప్రతీ ఉద్యోగి ప్రస్థానంలో పదవీ విరమణ అనేది ఒక సహజ ప్రక్రియ అని అన్నారు. పదవి విరమణ పొందుతున్న ఆర్డీవో రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్ములు ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ ఉత్తమ అధికారులుగా పేరు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. జిల్లా అభివృద్ధి కోసం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అంకితభావంతో పనిచేశారని వారి సేవలను కొనియాడారు. వాళ్ల అనుభవం జిల్లా యంత్రాంగానికి ఎంతో ఉపయోగపడిందని, భవిష్యత్తులో వాళ్లు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సంతోషంగా గడపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు అధికారులు మాట్లాడుతూ, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ, తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన ఇలాంటి అధికారుల సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని అన్నారు. పదవీ విరమణ పొందిన అధికారులు ఆర్డీవో రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. తమ సుదీర్ఘ సేవా కాలంలో సహకరించిన జిల్లా కలెక్టర్‌కు, తోటి అధికారులకు, సిబ్బందికి, కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విధి నిర్వహణలో ఎదురైన అనుభవాలను పంచుకుంటూ, అందరి సహకారంతోనే తాము విజయవంతంగా సేవలు అందించగలిగామని పేర్కొన్నారు.అనంతరం పదవి విరమణ పొందిన అధికారులకు ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు పుష్పగుచ్ఛాలు అందించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో సామాజిక న్యాయం పేరుతో మాదిగల గొంతు కోస్తున్న కాంగ్రెస్ పార్టీ

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షు డు ఆరెల్లి మల్లేష్ మాదిగ




**ఆదిలాబాద్ బ్యూరో, మే 30 (ప్రజా జ్యోతి)**జిల్లాలో సామాజిక న్యాయం పేరుతో కాంగ్రెస్ పార్టీ మాది గల గొంతు కోస్తుందని ఎమ్మా ర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరె ల్లి మల్లేష్ మాదిగ ఆరోపించా రు. శనివారం ఉట్నూరు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కో ఇన్చార్జి ఇందార పూ అఖిల్ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లే ష్ మాదిగ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో దళితుల జనాభా, మెజార్టీ జనాభా కలి గిన మాదిగలను కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా ఎదగకుండా గొంతు కోస్తూ ఒకవైపు బూట కపు మాటలతో సామాజిక న్యాయం పాటి స్తున్నామని ఏఐసీసీ, పిసిసి ఆదేశాలు మే రకే నియామకాలు అంటూ చెబుతున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇటీవల జిల్లా కమిటీలో అరవై మందిని నియ మిస్తే అందులో మాదిగలకు ఎ నిమిది మందికి ఇవ్వాల్సి ఉండగా కేవలం నలుగురికి మాత్ర మే ఇచ్చి గొప్పలు చెబుతు న్నారని అన్నారు.21 మండల అధ్యక్ష పదవుల్లో ఒక్కరికి కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవులు అయి నా ఏఎంసీ చైర్మన్ ల తో పా టు, ఎస్సీ సెల్ విభాగాలలో కూడా ఒక్కరికి కూడా అవ కాశం కల్పించకుండా ఉద్దేశ పూర్వకంగానే మాదిగ జాతిపై వివక్షతతో అన్యాయం చేస్తు న్నారని ఆరోపించారు. జిల్లా లో ప్రభుత్వ అన్ని సంక్షేమ పథకాలలో కూడా మాదిగలకు తీరని అన్యాయం చేస్తు న్నారని అనడానికి ఈ నియా మకాలే నిదర్శనం అన్నారు. మాదిగ జాతిని రాజకీయంగా దూరం పెట్టి అన్యాయం చేస్తు న్న కాంగ్రెస్ పార్టీ రాబోవు రోజుల్లో రాజకీయ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 1న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యట నకు వస్తున్నందున జిల్లాలో మాదిగలకు జరుగుతున్న అ న్యాయంపై స్పందించాలని విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ పార్టీ జిల్లాలో మాదిగలకు ప్రాధా న్యత కల్పించేంతవరకు పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో తమ నిరసన, పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటామని జిల్లా కాంగ్రెస్ నాయకులకు హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీ ఎస్పీ, ఎంఎస్పి రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా పెల్లి నవీన్, ఉప్పులేటి శ్రీను, బిరుదుల అభిషేక్, పోడేటి రాజ న్న, కళ్యాణ్, అందారే బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## సన్మానం



**బోథ్, మే 30 (ప్రజా జ్యోతి)**ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా బోథ్ మండలం నుండి బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందిని ఎంపీడీవో ఎల్ రమేష్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా బోథ్ మండలంలో వారు అందించిన సేవలు మరువలేనివి అని కొనియాడారు. ఉద్యోగులకు బదిలీ సహజమని ఎక్కడ పనిచేసిన క్రమశిక్షణతో, నిబద్ధతతో పనిచేసి గుర్తింపు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాజ్ కుమార్, పర్యవేక్షకులు రాజేశ్వర్ , పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపి రైతు భరోసా యాత్ర ఒక బూటకము పత్తి రెడ్డి



**సారంగాపూర్, మే,30,ప్రజా జ్యోతి** మండలంలో పలు ప్రాంతాలను పర్యటించిన పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి బిజెపి రైతు గోస బీజేపీ భరోసా అనే యాత్ర ఒక బూటకమని, ఎందుకంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొక్కజొన్న, వరి,జొన్న అన్ని రకాలుగా పంటలను కొనుగోలు చేస్తుంది అని తెలిపారు.మీ బిజెపి ప్రభుత్వం ఉన్న పక్క రాష్ట్రంలోనే జొన్నలు కొనుగోలు చేయడం లేదు వారు ఇక్కడికి వచ్చి అమ్ముకుంటున్నారని ధ్వజమెత్తారు. మీది డబుల్ ఇంజన్ ప్రభుత్వం అని చెబుతారు కానీ రైతులకు అన్ని ఇబ్బందులు పాలు చేయడం తప్ప ప్రయోజనం చేసేది ఏమీ లేదు అని అన్నారు. డీజిల్,పెట్రోల్ రేట్లు పెంచడం తగ్గించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ అయిర నారాయణరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ రాజేశ్వర్, మాజీ సర్పంచ్ రాజేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వివో ఏలకు పలువురు సంఘీభావం



**సారంగాపూర్, మే 30, ప్రజా జ్యోతి** మండల కేంద్రంలో గత తొమ్మిది రోజులుగా సమ్మె కొనసాగుతుండగా,వారికి మద్దతుగా ఏపీఎం మాధురి, సీసీలు విగ్నేష్,సునీత, జమాల్, ఐకేపీ సిబ్బంది. జామ్ టి జి బి బ్యాంక్ మేనేజర్ రాజేశ్వర్ సంఘీభావం తెలిపి వారి సమ్మెకు మద్దతు ఇచ్చారు. వీరు గత 20 సంవత్సరాలుగా సంఘాలు బలపడడానికి నిరంతరంగా కృషి చేసినారని వారికి కనీస వేతనాలు చెల్లించి క్రమబద్ధీకరణ చేయాలని కోరారు.

## ట్రాక్టర్ ట్యాంకర్‌తో దాహార్తి తీర్చిన సర్పంచ్

**వేసవిలో నీటి కష్టాలు తీర్చిన విమలబాయి: గ్రామస్తుల ప్రశంసలు**



**కేరమేరి మే 30 ప్రజా జ్యోతి** సాంగ్వి గ్రామపంచాయతీ పరిధిలోని రాంపూర్ గ్రామంలో తీవ్ర వేసవి కారణంగా తలెత్తిన తాగునీటి కొరతను సర్పంచ్ కార్వెత విమలబాయి తీర్చారు. గ్రామస్తులు నీటి కోసం ఇబ్బంది పడుతుండటాన్ని గమనించిన ఆమె స్వయంగా ట్రాక్టర్ ట్యాంకర్ ఏర్పాటు చేసి ఇంటింటికీ నీటిని సరఫరా చేశారు.ప్రజల కష్టాలు తీర్చడమే తన ప్రధాన బాధ్యత అని, వేసవి తీవ్రత తగ్గే వరకు నీటి సరఫరా కొనసాగిస్తామని సర్పంచ్ విమలబాయి ఈ సందర్భంగా తెలిపారు. సమయానికి స్పందించి దాహార్తి తీర్చిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాపూరావు, వార్డు సభ్యులు అరుణ, రాము, గ్రామ పటేల్ రాంశావ్, పాండు, సీతారాం, సంజు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## సీఎం సభను విజయవంతం చేయాలి

**ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలి: మునీర్ అహ్మద్**



**కేరమేరి మే 30 ప్రజా జ్యోతి** జూన్ 1న కాగజ్ నగర్ స్ రోడ్డు వద్ద నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్ పిలుపునిచ్చారు.శనివారము లింగూడలో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సభలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సభ విజయవంతానికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుసుమ రావు, సీనియర్ నాయకులు బాపురావు, ఉత్తమ్ నాయక్, నాణేశ్వర్, జంగు భగవంత్ రావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు

## షెడ్డు నిర్మాణానికి భూమి పూజ సర్పంచ్



**కెరమెరి ,మే 30 ప్రజాజ్యోతి** కెరమెరిగ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన రేకుల షెడ్డు నిర్మాణానికి శనివారం సర్పంచ్ పెందోర్ ఆనందరావు గారులి భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి గణేష్, కారోబార్ వెంకన్న, రాంచందర్, సలీమ్, సిబ్బంది నరేష్ తదితరులు ఉన్నారు.

## సీఎం సభా స్థలాన్ని పరిశీలిం చిన మాజీ ఎంపీ సోయం బా పూ రావు



**ఆదిలాబాద్ బ్యూరో, మే 30 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమం త్రి ఎనుముల రేవంత్ రెడ్డి వ చ్చేనెల 1వన కొమరం భీం ఆ సిఫాబాద్ జిల్లాలో పర్యటీంచ నున్నారు. కొమరం భీం ఆసి ఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ సమీపంలో నిర్వ హించనున్న భారీ భహిరంగ సభా స్థలాన్ని శనివారం మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్లే, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు పరిశీలించారు. సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మీద ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి కార్యక్రమా లు చేపట్టడం జరుగుతుందన్నారు. వీరి వెంట కనక తులసీ రా మ్, నంది రెడ్డి, రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు ఉన్నారు.

## ఆదిలాబాద్‌లో ‘అమ్మ మాట అంగన్ వాడీ బాట’

**పాల్గొన్న ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్**





**ఆదిలాబాద్ బ్యూరో, మే 30 (ప్రజా జ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక కార్యక్రమం ‘ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక’లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘అమ్మ మాట – అంగన్‌వాడీ బాట’ కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్ తో కలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మా ర్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మా ట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, చిన్నారుల సంక్షే మానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. మాతాశిశు ఆరోగ్య రక్షణ, గర్భిణీలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించ డంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని గుర్తు చేశారు. “మన అంగన్‌వాడీ – మన పిల్లల బంగారు భవిష్య త్తు” అనే నినాదంతో ప్రభు త్వం ముందుకు సాగు తోంద ని, ప్రజలందరూ అంగన్‌వాడీ సేవలను పూర్తిస్థాయిలో సద్వి నియోగం చేసుకుని పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బాటలు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో భాగంగా విద్యార్థులలో ప్రజాస్వామ్య విలువలు, చట్టసభల పనితీరుపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా నిర్వహించిన ‘మాక్ పార్ల మెంట్’ అందరినీ ఆకట్టు కుంది. అనంతరం అక్కడ ఏర్పా టు చేసిన ప్రత్యేక సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్ ఇతర అ ధికారులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి ఫోటోలు దిగారు.

## ఆడపిల్లల రక్షణ కే కిషోర్ బాలికల ర్యాలీ




**దిలావర్ పూర్ , మే 30 ,( ప్రజాజ్యోతి ).** ఈరోజు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళ వారోత్సవ లలోభాగంగా చైతన్య మండల సమైక్య దిలావర్పుర్ నందు కిషోర్ బాలికల ర్యాలీ తీయడం జరిగింది ఆడపిల్లలకు రక్షణ వరకట్న నిషేధం ఆడపిల్లలను చదివించడం మరియు ఆడపిల్లలకు ఆరోగ్య టెస్టులు ,రక్తహీనతచేయించిన్యూట్రిషన్ అందించడం వారి ఆరోగ్యం కాపాడడం ఆటలాడిపించడం సైకిల్ నేర్పడం తో పాటు శారీరక వ్యాయామం చేయించడం యోగ నేర్పించడం మహిళా సాధికారత ఈ సమాజంలో ఆడపిల్లలు ఎలా ఉండాలో చెప్పడం సైబర్ నేరం నుంచి ఎలా తప్పించుకోవాలి ఫోన్ వాడకుండా పుస్తకాలు ఎలా చదవాలి అనే వాటిపై మహిళా వారోత్సవాలులో భాగంగా సమావేశాలు ర్యాలీలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల ఏపిఎం అడ్డిగ బోసు,మండల సమైక్య అధ్యక్షురాలు సునీత, కోశాధికారి సంయుక్త, సీసీలు సాయన్న, పోశెట్టి, ముత్యం, శ్రీనివాస్ గ్రామ సంఘ సభ్యులు స్నేహ సంఘాల సభ్యులు మరియు అకౌంటెంట్ పాల్గొనడం జరిగింది.

## సీఎం సభా స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర కార్యదర్శి,నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ఖానాపూర్ మే 30 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ముఖ్యమం త్రి ఎనుముల రేవంత్ రెడ్డి వ చ్చేనెలజూన్ 1న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లోని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటీంచ నున్న సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి నిర్మల్ జిల్లా పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సభ స్థలాన్ని శనివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,ఎమ్మెల్సీ గండే విట్టల్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షురాలు అత్రం సుగుణ ఇతర ఉమ్మడి జిల్లా నాయకులతో కలిసి పరిశీలించారు కొమరం భీం ఆసి ఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ సమీపంలో నిర్వ హించనున్న భారీ భహిరంగ సభా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సభ విజయవంతానికి పలు సూచనలు పరస్పరం పంచుకున్నారు సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టి అ భివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం హర్షని యమని సభ విజయవంతానికి ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు పార్టీ సమస్త గత నాయకులు కార్యకర్తలు విజయవంతంకి కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే నిర్మల్ జిల్లా అధ్యక్షులు బొజ్జు పటేల్ పిలుపునిచ్చారు

# సెంట్రల్ ఆఫ్ ఇండియ న్ ట్రేడ్ యూనియన్స్ 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ

**దేశంలో కార్మిక కూలి వర్గాల హక్కుల పరి రక్షణ కోసం నిరంతర పోరాటం సిఐటియు**

**సిఐటియు జిల్లా జాయింట్ సెక్రెటరీ వెలిశాల కృష్ణమాచారి:**



**మే 30, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి మండల కేంద్రంలో సెంట్రల్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ 56 ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని జెండా ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించిన సిఐటియు జిల్లా జాయింట్ సెక్రెటరీ వెలిశాల కృష్ణ మాచారి అనంతరం ఈ సందర్భంగా కృష్ణమాచారి మాట్లాడుతూ.... దేశంలోని కార్మిక, కూలీ వర్గాల హక్కుల పరిరక్షణ కోసం గత 56 సంవత్సరా లుగా నిరంతర పోరాటా లు సాగిస్తున్నామని అన్నారు.కార్మికుల ఎనిమిది గంటల పని దినం, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత వంటి అనేక హక్కు లు కార్మిక ఉద్యమాల ఫలి తంగానే సాధ్యమయ్యా యని తెలిపారు.నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తు న్నాయని విమర్శించారు.అసంఘటిత రంగ కార్మికు లు,ఉపాధి హామీ కార్మికు లు, పారిశుద్ధ్య కార్మికులు, నిర్మాణ కార్మికులు, వ్యవ సాయ కార్మికులు ఎన్నో సమస్యలను ఎదుర్కొం టున్న వారి పక్షాన పరి ష్కారం కోసం సిఐటియు నిరంతరం పోరాడుతుం దని తెలిపారు. కార్మికుల ఐక్యతే వారి బలం అని, కార్మిక వ్యతిరేక విధానా లకు వ్యతిరేకంగా మరింత సంఘటితంగా ఉద్యమా లు చెయ్యాలని పిలుపు నిచ్చారు.కార్మిక వర్గ విముక్తి, సమాన హక్కు లు, సామాజిక న్యాయం సాధన కోసం సిఐటియు తన పోరాట పంథాను కొనసాగిస్తుందని పేర్కొన్నారు.నూతన లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ లో ప్రత్యేక తీర్మానం ప్రవే శపెట్టాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కు లను బలహీనపరిచే ఈ కోడ్ల అమలును అడ్డుకు నేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలపెంచిన కనీస వేతనాల్లో శాస్త్రీయత లోపించిందని విమర్శిం చారు. పెరిగిన నిత్యావ సరధరలు,జీవన వ్యయం కార్మిక కుటుంబాల అవస రాలను పరిగణనలోకి తీసుకోకుండా వేతనాలు నిర్ణయించారని ఆరోపిం చారు. కార్మికు లకు గౌరవ ప్రదమైన జీవనం అందేలా శాస్త్రీయ ప్రమాణాలతో కనీస వేతనాలను పున ర్నిర్ణయించాలని డిమాండ్ చేశారు.ఈ అంశాలన్నింటి పైనా కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాలు తక్షణమే సాను కూల నిర్ణయాలు తీసుకో వాలని కోరారు. నూతన లేబర్ కోడ్ల ఉపసంహరణ, శాస్త్రీయ ప్రమానాలతో కనీస వేతనాల నిర్ణయం, అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మిక వ్యతిరేక విధానా లను ఉపసంహరించ కపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాల. ను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు మానేపల్లి మురళీ సాయిరి రమేష్ సీనియర్ నాయకులు శివరాం గిరుగులే చందు వివిధ యూనియన్ల నాయకులు, కార్మికులు, సిఐటియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమ్మ మాట - అంగన్‌వాడీ బాట'ను విజయ వంతం చేయాలి





జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ బ్యూరో, మే 30 (ప్రజా జ్యోతి)** గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల సమగ్ర ఆరోగ్యం, పోషణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన “అమ్మ మాట - అంగన్‌వాడీ బాట” కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక రిక్షా కాలనీ లో మ హిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన “అమ్మ మాట - అంగన్‌వా డీ బాట” కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లభించే విభిన్న సేవలను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వి నియోగం చేసుకునేలా అధికారులు విస్తృత అవగాహన క ల్పించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు మన పిల్లల ప్రగతికి పునాది అని, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు, త ల్లుల సంరక్షణకు జిల్లా యం త్రాంగం నిరంతరం కృషి చే స్తుందని స్పష్టం చేశారు.అమ్మ మాట - అంగన్‌వాడీ బాట” పథకం ద్వారా లబ్ధిదారులకు అందుతున్న సేవల ప్రాధాన్య తను వివరించారు. గర్భిణీ స్త్రీలకు గర్భధారణ సమయం నుండి తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన సంపూర్ణ పౌష్టికాహారాన్ని, బలాన్నిచ్చే ఆహార పదార్థాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారాలోపం లేకుండా అందించాలని పేర్కొన్నారు. అలాగే, ప్రస వానంతరం తల్లులు త్వరగా కోలుకోవడానికి, శిశువుకు అ వసరమైన తల్లిపాలు సక్రమం గా అందేలా బాలింతలకు అ వసరమైన ప్రత్యేక ఆరోగ్య సే వలను, పోషకాహారాన్ని సమ కూర్చడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టా లన్నారు. మరోవైపు, 6 నెలల వయస్సు నుండి 6 సంవత్సరాలలోపు ఉన్న చిన్న పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల కు తోడ్పడేలా రుచికరమైన, పోషక విలువలు కలిగిన ఆ హారాన్ని ప్రతిరోజూ నిబంధనల ప్రకారం పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులలో విద్యా పునాది బలంగా ఉండాలని, అందుకు అంగన్‌వాడీ కేంద్రాలలో ఆట పాటలతో కూడిన నాణ్యమైన ప్రీ-స్కూల్ (పూర్వ ప్రాథమిక) విద్యను పక్కాగా అమలు చే యాలన్నారు. వీటితో పాటు, చిన్నారులను ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షించడానికి సకాలంలో వేయాల్సిన అన్ని రకాల టీకాలను (ఇమ్యునైజే షన్), క్రమబద్ధమైన ఆరోగ్య ప రీక్షలను వైద్య శాఖ సమన్వ యంతో ఉచితంగా నిర్వహిం చాలని సూచించారు. బాలల సమగ్ర అభివృద్ధికి అంగన్ వా డీ కేంద్రాలు ఒక బలమైనపు నాదిగా పనిచేస్తూ, ఆరోగ్యకరమైన బాల్యానికి బాటలు వేయాలని ఆకాంక్షిం చారు. ‘తెలంగాణ రైజింగ్’ సంకల్పంలో భాగంగా సాగుతున్న ఈ సేవలలో ఏవైనా లోపాలున్నా, లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా ప్రభుత్వ ఉచిత చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్: 1098 ను (24 గంటలు) సంప్రదించవ చ్చుని తెలియజేశారు. ఈ సం దర్భంగా అంగన్‌వాడీ కేంద్రం లోని పిల్లలకు కలెక్టర్ చేతుల మీదుగా అంగవాడి యూని ఫారంలను, ‘విద్యా ఆరంభ సర్టిఫికెట్లను’ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, వార్డ్ కౌన్సిలర్ స్వాతి మంగేష్ దేవతలే, స్థానిక అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పోషకులు, చిన్నారులు పాల్గొన్నారు.

# జిల్లాలో ముమ్మరంగా మొక్క జొన్న కొనుగోలు

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ బ్యూరో,మే 30, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లాలో మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వ మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయ ని, రైతులకు చెల్లింపుల ప్రక్రి యను అత్యంత వేగవంతం చేశామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు రూ. 52.34 కోట్ల విలువైన 2. 18 లక్షల క్వింటాళ్ళ మొక్కజొ న్నను రైతుల నుండి విజయ వంతంగా సేకరించినట్లు ఆ యన వివరించారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరపా లన్న ప్రభుత్వ ఆదేశాల మేర కు హైదరాబాద్‌లోని మార్క్ ఫెడ్ ప్రధాన కార్యాలయం నుండి ఆదిలాబాద్ జిల్లా కా ర్యాలయానికి మొదటి విడత నిధులుగా రూ. 31.08 కోట్లు విడుదలయ్యాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా కార్యాల యానికి అందిన ఈ మొదటి విడత నిధుల నుండి శని వారం (మే 30, 2026) రూ. 10.00 కోట్లను జిల్లాలోని 80 0 మంది రైతుల బ్యాంకు ఖా తాల్లోకి నేరుగా విడుదల చే యడం జరిగిందని స్పష్టం చే శారు. మొదటి విడతకు సం బంధించిన మిగిలిన రూ. 21. 08 కోట్లను కూడా రోజువారీ ప్రాతిపదికన రైతుల ఖాతాల కు ఆర్.టి.జి.ఎస్. లేదా నెఫ్ట్ ద్వారా నేరుగా జమ చేయా ల్సిందిగా అధికారులను ఆదే శించినట్లు చెప్పారు.దీనితో పాటు ప్రభుత్వం నుండి త్వర లోనే విడుదల కావలసిన తు ది విడత నిధులు రూ. 21.26 కోట్లు కూడా మార్క్ ఫెడ్ జిల్లా కార్యాలయానికి అందిన వెం టనే, ఏమాత్రం ఆలస్యం లే కుండా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. జిల్లాలోని రైతు సోదరులెవరూ చెల్లింపుల విషయమై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికీ మద్దతు ధర నిధులు నేరుగా వారి ఖాతాల్లోకే చేరుతాయని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఎదగాలనే సంకల్పం ఉంటే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారు



జిల్లా కలెక్టర్ రాజర్షిషా





**ఆదిలాబాద్ బ్యూరో, మే 30, (ప్రజా జ్యోతి)** మహిళలు అన్ని రంగాల్లో రా ణించినప్పుడే దేశం, రాష్ట్రం ప్రగతి సాధిస్తాయని జిల్లా కలె క్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం జిల్లా పరిషత్ మీటింగ్ హా ల్లో గ్రామీణాభివృద్ధి - సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర బాలికల "యువతుల మాక్ పార్లమెంట్" స్నేహ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం, రాష్ట్రం ప్రగతి సాధిస్తాయని, తెలంగాణ రైజింగ్ 204 7 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే సంకల్పంలో మహిళల పాత్ర కీలకమైనదన్నారు. కిశోర బాలికలు మొబైల్ ఫోన్లు, ప్రేమ వ్యవహారాలు వంటి ఆకర్షణలకు, అలాగే బాల్య వివాహాల వంటి సామాజిక రుగ్మతలకు దూరంగా ఉంటూ, తమ జీవితంలో ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని పిలుపు నిచ్చారు. 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు వి ద్యార్థుల జీవితంలో చాలా కీ లకమైన సమయమని, ఈ ద శలో బేసిక్స్ పై పట్టు సాధిస్తే సివిల్ సర్వీసెస్, గ్రూప్స్, నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షల్లో సులువుగా విజయం సాధించ వచ్చని తెలిపారు. కోచింగ్ కోసం భారీగా ఖర్చు చేయనవస రం లేకుండా ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి ఆన్‌లైన్ వేదికలను ఉచితంగా, తక్కు వ ఖర్చుతో సద్వినియోగంచే సుకోవచ్చన్నారు. జిల్లాలోని కేజీబీవీలలో విద్యాప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని, విద్యార్థులలో ఖగోళ శాస్త్రంపై ఆసక్తిని పెంచేందుకు టెలిస్కో పులను, స్పేస్, ఆస్ట్రోనమీ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. బాలికల్లో మెన్ స్ట్రువల్ హైజీన్ పై అవగాహ న పెంచడం కోసం పాఠశాల ల్లో ఉచితంగా శానిటరీ ప్యా డ్స్ అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గర్భిణీ స్త్రీలు ప్రసవాల విషయంలో మూఢనమ్మకాలను నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, సైన్స్‌ను నమ్మి సకాలంలో ఆసుపత్రులలో సు రక్షిత ప్రసవాలు చేయించు కో వాలని, దీనిపై స్నేహ గ్రూ పు లు అవగాహన కల్పించాలని కోరారు. స్నేహ గ్రూప్ బాలిక లు స్పీకర్, డెప్యూటీ స్పీకర్, అధికార, ప్రతిపక్ష పాత్రల్లో ఎం తో క్రమశిక్షణతో పార్లమెంట్ నిర్వహణ తీరును, సమస్యల ప్రస్తావనను ప్రదర్శించిన తీరును కలెక్టర్ ప్రత్యేకంగా అభినం దించారు. ఈ సందర్భంగా అమ్మకు అక్షర మాల సర్టిఫికెట్ లను కలెక్టర్ అందజేసి, విద్యా బోధన మెరుగుకు కృషి చేసి నందుకు ఆదిలాబాదు గ్రామీణ మండలం మత్తడిగూడాకు చెందిన అంగన్వాడీ టీచర్ మ యూరిని, పలువురు మహిళ లను శాలువాతో సన్మానించి, అమ్మ మాట-అంగన్వాడీ బాట సెల్ఫీ పాయింట్ వద్ద అవా నీతులతో కలిసి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలె క్టర్ ఎస్.రాజేశ్వర్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీ సీఈఓ రవి, డీడబ్ల్యూఓ మిల్కా, డీఆర్డీ ఓరవీందర్ రాథోడ్, డీఎంహెచ్ ఓనరేందర్ రాథోడ్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, సెర్ప్ అధికారులు, అంగన్ వాడీ టీచర్లు, స్నేహ గ్రూప్ ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సిర్పూర్(టి)మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఒడ్డేటి నాగమణి,నానయ్య సహకారంతో

**నిర్వహించిన ఎస్.సి.పి.ఎల్, క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన సిర్పూర్ (టి) ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ రావు:**



**మే 30 సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి (ప్రజాజ్యోతి):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాసిర్పూర్(టి)మండలం మేజర్ గ్రామపంచా యతీ సర్పంచ్ ఒడ్డేటి నాగమణి నానయ్య సహకారంతో మండల కేంద్రంలోని హై స్కూల్ ప్లే గ్రౌండ్ లో గత నెల రోజు లుగా జరుగుతున్న సిర్పూర్ కాన్సెప్ట్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ముగింపు మహోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిర్పూర్(టి) శాసన సభ్యులు డా..పాల్వాయి హరీష్ రావు విజేతలుగా నిలిచిన జట్లకు బహుమ తులతో పాటు ట్రోఫీలను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సిర్పూర్ (టి) ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ రావుమాట్లాడుతూ సిర్పూర్ (టి)మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఓ ఒడ్డేటి నాగమణి, నాన్నయ్య సహకారంతో జరిగిన ఈ టోర్నమెంట్ గత నెల రోజులుగా ఆట గాళ్లకు ప్రేక్షకులకు కను విందు కలిగించిందని తెలియజేశారు. సిర్పూర్ (టి) మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణా నికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.విజేతలైన రాళ్ళ గూడ టీం కు లక్ష రూపాయలు,అదేవిధంగా రన్నర్స్ గా నిలిచిన హంగ్రీ హంటర్స్ టీం లను రూ 50 వేల నగదు తో పాటు ట్రోఫీలను ప్రధానం చేసామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ (టి)తహసీల్దార్ రహీము ద్దీన్ సర్పంచులు ఒడ్డేటి నాగమణి, నానయ్య, రాచెర్ల మహేష్, వాడాయి పోషెట్టి, ఉప సర్పంచ్లు దుర్గం ప్రశాంత్, గాడి శేఖర్, మాజీ ఎంపీటీసీ ఎలుములే శంకర్, వార్డు మెంబర్లు బసర్కర్ సాయి, థోర్ గణేష్, యువరాజ్, నాయకులు గద్దం రంగన్న,తెకం భీమ్ రావు, కిరమరే శ్యామ్ రావు, తోట సంతోష్, బొమ్మరాజుల శ్రీకాంత్, ఎర్ర అశోక్, చంద్రగిరి లక్ష్మణ్, మరికొండ సాయి, షారుక్, బామినె సాయి, ఎల్ల శ్రీకాంత, మచ్చ గణేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మా ధాన్యం తేమ చూడండి సారూ .. తహసీల్దార్ ఆఫీస్ ముందు బస్తాలతో రైతులు

**నెన్నెల :** కాంగ్రెస్ సర్కార్ పాలనలో రైతన్నలకు తిప్పలు తప్పడం లేదు. ఆరుగాలం పండించిన పంటను అమ్ముకుందామంటే కష్టాలు తప్పడం లేదు. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సారూ మా వడ్లు కాంట చేసి ఇరవై రోజులయింది.. కాంట అయిన బస్తాలను లారిలో ఎక్కించండి అంటే సదరు డీసీఎంఎస్ నిర్వాహకుడు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదేందీ అని అడిగితే కాంట చేసిన బస్తాలను మరలా వడ్లను కింద పోసి తేమ చూసిన తర్వాతే కాంట చేయాలని అంటున్నారని మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గొల్లపల్లికి చెందిన రైతులు మెండే కిష్టయ్య, కాల్వ రాజాం, బండి రమేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారంతా శనివారం తాసిల్దార్ కార్యాలయం ముందు బస్తాలు తీసుకు వచ్చి వారి ఆవేదనను తహసీల్దార్ శ్రీనివాస్‌కు చెప్పుకున్నారు. సారు వాళ్లు పట్టించు కోవడం లేదు మీరన్నా మా వడ్లను తేమ చూసి పంపండి.. అంటూ వేడుకున్నారు. పలుకుబడి ఉన్న వాళ్ళవి తేమ కూడా చూడడం లేదని తమ వడ్లు ఎండలకు ఎండి తేమ 9 వరకు వచ్చిందని రైతులు చెప్పారు. మే 10న కాంట అయిన బస్తాలను ఖాళీ చేయమంటే ఎలా సారు. మళ్లీ కాంట చేస్తే హమాలీ ఛార్జీలు మా మీదనే పడుతున్నాయని ఆందోళన చెందారు. ఇది కావాలనే మమ్ములను వేదిస్తున్నారని ఒక వేళ తమ బస్తాలను లోడింగ్ చేయకుంటే మమ్ములను వేధిస్తున్న వారి పేర్లు రాసి ఇక్కడే చస్తామని కన్నీరు పెట్టారు. దీంతో తహసీల్దార్ శ్రీనివాస్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని రైతులకు నచ్చజెప్పారు.

## బీఆర్ఎస్ కౌన్సిలర్ కాసర్ల పద్మకు సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ కన్నీటి నివాళి

**రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపాలిటీ 26వ వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మకు మున్సిపల్ కౌన్సిల్ కన్నీటి నివాళి అర్పించింది. ఈ మేరకు శనివారం సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. గుండెపోటుతో బీఆర్ఎస్ కౌన్సిలర్ కాసర్ల పద్మ శుక్రవారం ఉదయం హఠాన్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మున్సిల్ కౌన్సిల్ సమావేశంలో మొదటగా కౌన్సిలర్ కాసర్ల పద్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మృతి కౌన్సిల్‌కు తీరని లోటు అని అభిప్రాయపడ్డారు. కౌన్సిలర్ పద్మ సంతాపకంగా సమావేశాన్ని నిర్వహించి అనంతరం సమావేశాన్ని జూన్ 3వ తేదీకి వాయిదా వేశారు.

## ఉద్యాన పంటల రైతులకు సబ్సిడీపై "డ్రిప్ ఆటోమేషన్" సాంకేతికత అందజేత

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె.బంగ కోటేశ్వర్**

**చుంచుపల్లి, మే 30 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఉద్యాన పంటల రైతులకు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ శుభవార్త అందించింది. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు చేస్తున్న రైతులకు నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు "డ్రిప్ ఆటోమేషన్" సాంకేతికతను సబ్సిడీపై అందించనున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె. బంగ కోటేశ్వర్ తెలిపారు. డ్రిప్ ఆటోమేషన్ వ్యవస్థ ద్వారా రైతులు మొబైల్ ఫోన్ లేదా కంట్రోల్ యూనిట్ సహాయంతో నీటి పారుదల వ్యవస్థను సులభంగా నియంత్రించవచ్చు. దీంతో నీటి వినియోగం తగ్గడంతో పాటు విద్యుత్, శ్రమ, సమయం ఆదా అవుతాయని చెప్పారు. నేలలోని తేమ స్థాయిని బట్టి ఆటోమేటిక్‌గా నీటి సరఫరా జరిగే విధంగా ఈ వ్యవస్థ పని చేస్తుందన్నారు. ఈ పథకం కింద ఒక హెక్టారు విస్తీర్ణానికి డ్రిప్ ఆటోమేషన్ యూనిట్ ధర రూ.40,000గా నిర్ణయించారు. ఇందులో రైతులకు 55 శాతం సబ్సిడీగా రూ.22,000 అందించగా, మిగిలిన 45 శాతం అంటే రూ.18,000 రైతులు భరించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ సబ్సిడీని =ఖన్రాణవీజ పథకాల ద్వారా అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకున్న రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

# ఆసిఫాబాద్ జిల్లాకు విచ్చేస్తున్న చీఫ్ మినిస్టర్ రేవంత్ రెడ్డికి స్వాగతం

## కుమురం భీం జిల్లా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

## సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్:



**మే 30 సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతి నిధి ప్రజాజ్యోతి:**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి కు సిపిఎం జిల్లా కమిటీ తరపున హృదయపూర్వక స్వాగతం, ప్రకృతి సంపదలు, అడవులు, నదులు, సాగునీటి వనరులు సమృద్ధిగా ఉన్నప్పటికీ కుమురం భీం జిల్లా అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉండడం అత్యంత బాధాకరం. జిల్లాలో అనేక ప్రాజెక్టులు, కాలువల, నిర్మాణాలు సంవత్సరాలుగా అసం పూర్తిగా ఉండడం కొన్ని చోట్ల ప్రాజెక్టులు నిర్మించి కాలువలు పూర్తి చెయ్యకుండా వదిలేయడం మరికొన్ని చోట్ల కాలువలు నిర్మించి ప్రాజెక్టులను అసంపూర్తిగా ఉంచడంతో నాలుగు వైపులా నీరు ఉన్నా రైతులకు సాగునీరు అందడం లేదని అన్నారు వేలాది ఎకరాల భూమి సాగుకు నోచుకోక రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.ప్రభుత్వం వెంటనే జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణాలను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని సూచించారు. సాగునీరు అందితే జిల్లా తెలంగాణలోనే అత్యంత శశశ్యామలంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న ఏకైక ప్రధాన పరిశ్రమ సిర్పూర్ పేపర్ మిల్లులో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమవు తోంది. స్థానిక నిరుద్యోగ యువకులు అర్హతలుకలిగి ఉన్నప్పటికీ ఇతర రాష్ట్రాల వారికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న పరిస్థితి కొనసా గుతోంది. ఫలితంగా జిల్లా యువత నిరుద్యోగులుగానే మిగిలి పోతున్నారని అన్నారు. ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు,ఇతర రాష్ట్రా లకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.స్థానిక ప్రజలు పేపర్ మిల్లు నుంచి వెలువడే కాలుష్యం, విషవాయువుల ప్రభావాన్ని భరిస్తుంటే ఉద్యోగాలు,ఆర్థిక ప్రయోజనాలు మాత్రం బయటి ప్రాంతాల వారికి దక్కుతున్నాయని అన్నారు. స్థానికులకు ఉద్యోగాలు లేకపోవడం వల్ల జిల్లాలో వ్యాపార రంగం కూడా అభివృద్ధి చెందడం లేదని తెలిపారు ఉద్యోగులఆదాయం జిల్లా లోనే ఖర్చు కాకపోవడం తో చిన్న వ్యాపారులు, వ్యాపార సంస్థలు కూడా ఇబ్బందులు పడుతున్నా రని తెలిపారు.అందువల్ల సిర్పూర్ పేపర్ మిల్లులో స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో వైద్య రంగ పరిస్థితి కూడా ఆందోళన కరంగా ఉందని మెరుగైన వైద్యం కోసం ప్రజలు హైదరాబాద్ వంటి నగ రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగినంతమంది వైద్యులు నిపుణులు లేకప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలిపారు.వెంటనే వైద్యుల ఖాళీలను భర్తీ చేసి మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు అదేవిధంగా జిల్లాలో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇతర సాంకేతిక విద్యా సంస్థల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు.ఉన్నత, సాంకేతిక విద్య కోసం విద్యార్థులు ఇతర జిల్లా లకు వెళ్లాల్సి వస్తుందని అన్నారు.దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులుఅనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని అన్నారు. జిల్లాలో నాణ్యమైన టెక్నికల్ కాలే జీలు,పాలిటెక్నిక్ కళాశాల లు,నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్నీ ఉన్నా అభివృద్ధి ఫలాలు అందని పరిస్థితి లో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా “అల్లుడి నోట్లో శని” అన్న చందంగా మారిందని అన్నారు ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, సాగునీరు, ఉపాధి,వైద్యం,విద్యరంగా ల్లో తక్షణ చర్యలు చేపట్టి జిల్లాను సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమ కారుల సంక్షేమం కొరకు నియమించిన కమిటీ సభ్యులు




## సంబంధిత ఉన్నతాధి కారుల సమీక్ష సమావేశంలో

## ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చ జరిగింది:

## తెలంగాణ ఉద్యమ కారుల వేదిక రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్:

**మే 30, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల వేదిక రాష్ట్ర వైస్ చైర్మన్ శంకర్ గౌడ్ పత్రిక ప్రకటన విడుదల చేస్తూ చరవాణి పై మాట్లాడుతూ వారు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కొరకు నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉద్యమకారుల సంక్షేమ కమిటీ ఛైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించా రని తెలిపారు. ఈ కమిటీలోఉద్యమకారుల సంక్షేమ కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి లు సంబంధిత ఉన్నతాధికారులతో జరిపిన ఈ సమావేశంలో ఉద్యమకారుల విధి, విధానాలు, సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారని తెలిపారు.తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన జీవో ఆర్.టి. నంబర్:679 జారీ చేశారని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ సచివాల యంలో మొదటి సారి నేడు సమావేశమైనట్లు తెలియజేశారు.జూన్ 4వ తేదీన అన్ని పార్టీల ప్రతి నిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ఉద్యమ కారులందరినీ గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించడం ప్రభుత్వ లక్ష్యమని కమిటీ చైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారని అన్నారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ లలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందిం చాలని అధికారులను కమిటీ ఆదేశించిందని అన్నారు.ఉద్యమకారుల గుర్తింపు ప్రమాణాలు జైలు శిక్షలు,అనుభ వించిన వారు, పలు పోలీస్ కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్ లు,విద్యార్థులు,ఆర్టిసి కార్మికులు, సింగరేణి కార్మికులను గుర్తించి, సముచితంగా గౌరవించా లన్నది ప్రభుత్వ లక్ష్య మని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపా రని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించడం,
అలాగే వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన లో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరఫున తగిన గౌరవం,గుర్తింపు అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించిందని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఉద్యమకారుల సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించి ప్రభుత్వం ద్వారా సంక్షేమం అందిస్తామని అన్నారు. ఉద్యమకారుల ను గౌరవించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారని అన్నారు.ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, జి.ఎ.డి కార్యదర్శి రఘునందన్ రావు, జి.ఎ.డి ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల వేదిక రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్ తెలిపారు.